నిత్యాన్నదాన ప్రసాదానికి రూ.3లక్షలు విరాళం

శ్రీకాళహస్తి,జనవరి 27 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి ఇతర రాష్ట్రాల భక్తుల నుంచి భూరి విరాళాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో బెంగుళూరుకు చెందిన భక్తులు ముగ్గురి పేరుతో రూ.3లక్షల విరాళం అందించారు. ఈ నేపథ్యంలో బెంగుళూరుకు చెందిన పి.పర్వేష్ వేదిక రెడ్డి, ఆర్.యశ్వంత్,ఆర్ గోకుల్, ధనంజయులు,అర్చనల పేరుతో ఒక్కొక్కరు రూ.లక్ష చొప్పున ముగ్గురు మూడు లక్షల రూపాయలను ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి విరాళంగా అందించారు. వారికి ప్రోటోకాల్ ఎఇఓ మోహన్ దాతలకు స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనంతో పాటు వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

పార్థసారథిస్వామిగా తెప్పపై విహారం

తిరుపతి,జనవరి 27ప్రభాతవార్త:
గోవిందరాజస్వామి ఆలయ వార్షిక తెప్పోత్సవాల్లో రెండవరోజు మంగళవారం సాయంత్రం రుక్మిణీసత్యభామసమేత పార్థసారథిస్వామి భక్తులను కటాక్షించారు. సాయంత్రం 6.30గంటలకు తెప్పపై ఐదుచుట్లు విహరించి భక్తులకు అభయమిచ్చారు. పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఎఈఓ నారాయణచౌదరి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయ,అర్చకులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా

13 మంది విద్యార్థులకు గాయాలు

రోడ్డుపై బోల్తా పడ్డ ఆటో

ప్రమాదంలో గాయపడిన విద్యార్థి

బంగారుపాళ్యం, జనవరి 27 ప్రభాతవార్త:
మండలంలోని వేపనపల్లి గ్రామ సమీపం రోడ్డుపై ఆటో బోల్తా పడి 13 మంది విద్యార్థులు గాయపడగా, వారిలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాలిలా వున్నాయి. వేపనపల్లి గ్రామంకు చెందిన విద్యార్థులు 4 కిమీ దూరంలో గల రాగిమానుపెంట జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకోవడానికి ఆటోలో వస్తూ ప్రమాదానికి లోనయ్యారు. గ్రామం నుండి బయలుదేరిన ఆటో కొంత సమయానికే ఎదురుగా వస్తున్న బస్సును తప్పించపోయి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాగిమానుపెంట జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న టెన్త్ విద్యార్థులు దిలీప్, పూర్ణ, హారిక, శృతి, గాయత్రి, ధనుష్, మహేంద్ర, చరణ్, లేఖలు గాయపడ్డారు. అలాగే 6వ తరగతి చదువుతున్న మనోజ్, 7వ తరగతి విద్యార్థి గణేష్, బంగారుపాళ్యంలో ఇంటర్మీడియేట్ చదువుతున్న పూజిత, ప్రవల్లికలు గాయపడ్డారు. గాయపడిన విద్యార్థులందరినీ వెంటనే అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడటంతో వారిని మెరుగైన చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంస్థాగత ఎన్నికలు బలాదూర్ !?

ఉమ్మడి జిల్లాలో పదవుల కోసం తెలుగుతమ్ముళ్ళ ప్రదక్షణలు !

ప్రభాతవార్త–తిరుపతి:
సిఎం చంద్రబాబు సొంతజిల్లాలో సొంత పార్టీ నేతలు పార్టీలో పలు కీలక పదవులు అందుకోలేక అసహనం చెందుతున్నారు. ఇప్పటికే సంస్థాగత ఎన్నికలు నిర్వహించి పదవులు కట్టబెట్టాల్సిన పార్టీ అధిష్టానం పాతవారితోనే నెట్టుకొస్తుండటంపై పెదవివిరుస్తున్నారు.ఇప్పటికే పార్టీ సభ్యత్వనమోదు పూర్తిచేసిన నేతలు ఇప్పుడు నామినేటెడ్ పదవులు దక్కని సీనియర్ నేతలు పార్టీలో కీలక పదవులు అయినా దక్కుతాయా అనే ఆశతో ఉన్నారు.ఇప్పటికే పార్లమెంట్ కమిటీలను నియమించిన టిడిపి అధిష్టానం సంక్రాంతి కానుకగా ప్రధాన పార్టీ పదవులతో బాటు అనుబంధ విభాగాల పదవులను భర్తీచేస్తారని చూశారు. అయితే గత ఇరువైరోజులుగా సిఎం చంద్రబాబునాయుడు, యువనేత మంత్రి నారాలోకేశ్ అభివృద్ధిలో బిజీగా ఉండటంతో పార్టీ పదవులు ఎప్పుడొస్తాయోననే తెలుగుతమ్ముళ్ళు అసహనంతో ఉన్నారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల ఇన్‌ఛార్జీల పదవులు భర్తీచేయాల్సి ఉంది. ఇంకా రాష్ట్రకమిటీ, జిల్లా కమిటీ, మండల, డివిజన్ కమిటీలను,అనుబంధ విభాగాలకు పదవులను భర్తీచేయలేదు. కొన్ని నియోజకవర్గాల్లో సీనియర్ల నేతలు,నేతల పనితీరు అసంతృప్తిగా ఉందనే ఆరోపణలు ఉన్నాయి. అలాంటి చోట్ల పరిశీలకులను నియమించిన టిడిపి అధిష్టానం పార్టీకేడర్‌ను కలుపుకెళ్ళి పనిచేయాలని ,ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమపథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని నిర్దేశం చేశారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో 14 నియోజకవర్గాలకుగాను ఒకచోట వైసిపి,మరోచోట జనసేన పార్టీల ఎమ్మెల్యేలు ఉన్నారు. సభ్యత్వనమోదు మాత్రం ఆశించిన రీతిలో జరిగిందనేది పార్టీనేతల అభిప్రాయం. ఇప్పుడు పార్టీలో పదవులకోసం సంస్థాగత ఎన్నికలు జరుపుకోవడానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నా అధిష్టానం నుండి గ్రీన్‌సిగ్నల్ రాలేదు. మండలాల్లో పార్టీ మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వార్డు,గ్రామ పార్టీ కేడర్‌ను నియమించుకోవాల్సి ఉంది. పార్టీకోసం పనిచేస్తున్న నేతలు,కార్యకర్తలకు ఈ పదవులు అప్పగిస్తే పార్టీ బలోపేతం కావడమేగాక స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండి అటు అధికారులతో ఇటు ప్రజలతో మమేకమయ్యే వీలుకలుగుతుందనేది పార్టీలో సీనియర్ నేతల అభిప్రాయం. తిరుపతి నియోజకవర్గంలో తిరుపతి నగరపాలకసంస్థ పరిధిలో 50 డివిజన్లు ఉన్నాయి. ఈ డివిజన్లలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, అభివృద్ధి కమిటీ ,వార్డు,బూత్ స్థాయి నాయకులను ,టిడిపి అనుబంధ సంఘాల పదవులు, నగర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి పదవి కీలకం. ఈ పదవులకోసం పలువురు నేతలు పోటీపడుతున్నారు. పనిచేసే వారికే పదవులు ఇవ్వాలనే డిమాండ్ కూడా ఇప్పటికే బలంగా వినిపిస్తోంది. మరీ ఒకసారి పనిచేసిన వారికి తిరిగి పదవులు ఉండవనే వాదన కూడా లేకపోలేదు. ఈ నేపథ్యంలో పార్టీ అధికారంలో ఉన్న ప్రస్తుత సమయంలో కార్యకర్తలకు ,ప్రజలకు అందుబాటులో ఉండి వారి కష్టాలను పరిష్కరించే నాయకులకే పదవులు దక్కుతాయనేది పార్టీలో చర్చనీయాంశంగా మారింది. తిరుపతి నియోజకవర్గంలో సమర్థులైన నాయకులు ఇన్‌ఛార్జి పదవికి లేరనేది అధిష్టానం తేల్చేసింది. ఇక జిడినెల్లూరు, పూతలపట్టు, శ్రీకాళహస్తి, నగరి, పలమనేరు, చంద్రగిరి, పుంగనూరు, చిత్తూరు ,వెంకటగిరి, సూళ్ళూరుపేట నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు తమతో కలసి నడిచేవారికి తమ వారికి పార్టీ పదవులతో అయినా నచ్చచెప్పాలని ఆలోచనతో ఉన్నారు.

మూతపడ్డ బ్యాంకులు

5 రోజుల పని దినాల డిమాండ్ సాధన కోసం రోడ్డెక్కిన బ్యాంకు ఉద్యోగులు

చిత్తూరు, జనవరి 27 ప్రభాతవార్త:
జిల్లా వ్యాప్తంగా మంగళవారం బ్యాంకులు మూతపడ్డాయి. తమకు సైతం వారంలో ఐదు రోజులు మాత్రమే పని దినాలు కల్పించి తమపై వున్న ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రం చిత్తూరులో బ్యాంకు మేనేజర్ల స్థాయి నుండి అటెండర్ స్థాయి వరకు రోడ్డెక్కారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం బ్యాంకులకు పని దినాలు అయినప్పటికీ బ్యాంకు ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకు పోరాటానికి దిగడంతో జిల్లాలోని బ్యాంకులు అన్ని మూతపడ్డాయి. బ్యాంకు సేవలు లేకపోవడంతో అత్యధిక ఖాతాదారుల లావాదేవిలు మంగళవారం స్తంభించిపోయాయి. యూనిటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్స్ పిలుపు మేరకు జిల్లాలోని వివిధ బ్యాంకుల్లో విధులు నిర్వర్తించే బ్యాంకు మేనేజర్లు, క్యాషియర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు, సీనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు మంగళవారం బ్యాంకులను మూసి వేసి తమ డిమాండ్లను సత్వరం పరిష్కరించాలని రోడ్డెక్కారు. బ్యాంకులకు వారంలో ఐదు రోజుల పని దినాలకు సంబంధించి వేతన సవరణలో అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం అమలుకు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బ్యాంకు యూనియన్ల నాయకులు దుమ్మెత్తిపోశారు. తమ సమస్యలను త్వరితంగా పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో నిరవధిక సమ్మెలో పాల్గొంటామని ప్రభుత్వంను యూనియన్ నాయకులు హెచ్చరించారు. బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సిఐటియు నాయకులు సంఘీభావం ప్రకటించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యునిటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్స్ నాయకులు శేఖర్, శ్రీహరి, వినోద్, చలపతి, గంగిరెడ్డి, యోగేష్, నాగర్జున, కిరణ్, సెల్వం, వివిధ బ్యాంకుల యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన జయప్రదం చేయాలి : కలెక్టర్

- సిఎంచే పెన్షన్ల పంపిణీ .. లబ్దిదారులతో ముఖ్యమంత్రి సమీక్ష !!

కుప్పం, జనవరి 27 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనను అధికార య ంత్రాంగం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. మంగళవారం ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్, జిల్లా ఎస్పీ తుషార్ డూడీలతో కలసి ఆయన అధికారులతో సిఎం పర్యటన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు పర్యటనలో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్ర మాలకు శ ంకుస్థాపన, ప్రారంభోత్సవాలు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. కుప్పం మున్సిపాలిటీలో ఏదో ఒగ్రామంలో సిఎం లబ్దిదారులతో మాట్లాడతారన్నారు. అలాగే బహిరంగసభలో పాల్గొని ప్రసంగించడంతో పాటు లబ్దిదారులకు వివిధ ఆస్తుల పనిముట్లు చేస్తారన్నారు.అలాగే వ్యవసాయ అనుబ ంధ రంగాలపై ప్రత్యేక సమీక్షాసమావేశం ఉంటుందన్నారు. అధికారులు ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అలాగే కుప్పంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభిస్తారన్నారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు కృష్ణా జలాలపై డాక్యుమెంటరీ సిద్ధం చేయాలని ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడిల్, శిక్షణ ఎస్పీ తరుణ్, వివిధ శాఖల అధికారులు

30నుంచి సిఎం చంద్రబాబు కుప్పం పర్యటన

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో ఈనెల 30వతేది నుంచి పర్యటించనున్నట్లు సమాచారం. ఈ మేరకు సిఎం పర్యటన షెడ్యూల్‌ను అధికారులు ఖరారు చేస్తున్నారు. 30వతేది ను ంచి ఫిబ్రవరి1 వరకు సిఎం పర్యటన ఉండవచ్చని తెలిసింది. కుప్పంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడంతో పాటు కంగుందిలో టూరిజం అభివృద్ధికి శంకుస్థాపన చేస్తారని సమాచార ం. అలాగే పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ సామాజిక భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు బహిరంగసభలో ప్రసంగిస్తారని తెలిసింది. పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడి

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

నారాయణవనం, జనవరి 27 ప్రభాతవార్త :
పుత్తూరు సమీపం నారాయణవనం మండలం పరిధి సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం(ఇఇఇ) బిటెక్ చదువుతున్న ప్రదీప్‌కుమార్(19) ఓ ప్రవేటు హాస్టల్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా వున్నాయి. కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు ప్రదీప్‌కుమార్ సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ప్రదీప్‌కుమ్బార్ కళాశాలకు సమీపంలోని శ్రీ కృష్ణహాస్టల్ మొదటి అంతస్తులోని ఓ గదిలోని సహా విద్యార్థులతో కలిసి వుంటూ చదువుకుంటున్నాడు. అయితే మంగళవారం ఉదయం సుమారు 11గంటల ప్రాంతంలో హాస్టల్ గదిలోనే ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ప్రదీప్‌కుమార్ కళాశాలకు రాపకపోవడంతో అతని స్నేహితుడు ఫోన్ చేశాడు. ఫోన్ తీయకపోవడంతో మధ్యాహ్నం 3గంటలకు హాస్టల్ గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొని వుండడంతో హాస్టల్ నిర్వాహకులు మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం స్థానిక ఎస్ఐ శ్రీనివాసులకు సమాచారం అందించడంతో వెంటనే ఎస్ఐ మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తల్లితండ్రులకు సమాచారం అందించి, విద్యార్థి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడన్న కోణంలో పుత్తూరు రూరల్ సిఐ రవీంద్ర, ఎస్ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి దర్యాప్తు చేసుకున్నారు. విద్యార్థి ఆత్మహత్యకు సంబందించి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

కుటుంబ సమగ్ర సమాచార సర్వే వేగవంతం చేయండి

-కమిషనర్ మౌర్య

తిరుపతి,జనవరి 27ప్రభాతవార్త:
తిరుపతిలో ప్రభుత్వం నిర్వహిస్తున్న కుటుంబ సమగ్ర సమాచార సర్వేని వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. పోస్టల్ కాలనీ నాల్గవ వార్డులో జరుగుతున్న కుటుంబ సమగ్ర సమాచార సర్వేని ఆమె పరిశీలించారు. కుంటుంబం యొక్క వివరాలు ఏ విధంగా నమోదు చేస్తున్నారనే విధానాన్ని పరిశీలించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కుటుంబ సమగ్ర సమాచార సర్వేను గడువు లోపు పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి కుటుంబంలోని వారి యొక్క ఆర్థిక, సామాజిక, విద్య తదితర స్థితిగతులను సమగ్రంగా తెలుసుకోవాలని తెలిపారు. అధికారులు సిబ్బంది సమన్వయం చేసుకుని ప్రతి ఇంటికి వెళ్లి అన్ని వివరాలను సమగ్రంగా సేకరించి అప్లోడ్ చేయాలని సూచించారు. ఇందులో ఎటువంటి అవకతవకలకు చోటు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. స్వర్ణ వార్డులో హాజరు నమోదును పరిశీలించి, కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కాలువల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించి, పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. కుటుంబ సమగ్ర సమాచార సర్వేకి వచ్చే మా స్వర్ణ వార్డు కార్యదర్శులకు సమాచారం అందించి సహకరించాలని కమిషనర్ ప్రజలను కోరారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఆర్.ఐ.లు మోహన్, రఫీ, అడ్మిన్ సెక్రటరీ లు రుద్రపాణి, సురేష్, పలు విభాగాల కార్యదర్శులు, శానిటరీ సిబ్బంది ఉన్నారు.

రూ.12కోట్లతో అదనపు భవనాలు : ప్రారంభానికి ముందే ఉరుస్తున్న వైనం

పైన పటారం లోన లోటారం: ఓటిలో లైట్ లేదు:పార్టిషియన్ లేదు : నిర్మించిన గదులు ఉపయోగించలేని దుస్థితి

శ్రీకాళహస్తి,జనవరి 27 ప్రభాతవార్త
శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రి శ్రీకాళహస్తి,సత్యవేడు,సూళూరుపేట నియోజకవర్గాలకు కేంద్రంగా ఉంది.జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన ఆసుపత్రిని 1999లో అప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ప్రారంభించారు. ఇక్కడ వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి అయ్యలనాడు చెరువులో అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 11 ఎకరాల స్థలాన్ని కేటాయించారు.ప్రపంచ బ్యాంకు నుంచి రూ.5కోట్లు నిధులు సాధించి నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసారు. నాటి కట్టడాల నిర్మాణం,నాణ్యత చెక్కు చెదరలేదు.సామాన్య భక్తులతో పాటు మధ్యతరగతి రోగులకు స్పెషల్ గదులను నిర్మించారు.

రాష్ట్రంలోనే లేని విధంగా రెండవ అంతస్తు:

రాష్ట్రంలో ఏ ఏరియా ఆసుపత్రిలోనూ లేని విధంగా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో రెండవ నిర్మాణానికి రూ.12కోట్లతో నిర్మాణాన్ని చేపట్టారు. ఈ నిర్మాణం ఐదేళ్ళ పాటు సాగించారు. అయితే నిర్మాణం అంతా అస్తవ్యస్తం.ఇక నిర్మాణ పనులు గమనిస్తే ఆపరేషన్ ధియేటర్‌లో గదుల పార్టిషియన్ లేదు.అంతకన్నా దారుణం కనీసం ఆపరేషన్ లైట్ లేదు. ఇక పై అంతస్తు నిర్మాణం పూర్తి అయ్యింది కానీ ఉపయోగానికి వీలు పడటం లేదు.ఎ గది చూసినా ఉరుస్తుంది. గత పాలకులు తమ ప్రగతి అని చెప్పుకుంటున్నా ఆచరణలో భవనానికి రంగులు తప్ప నాణ్యత లేదు.ప్రస్తుతం గదులకు బోర్డులు ఏర్పాటు చేసారు తప్ప ఉపయోగించాలంటే వర్షాకాలం ఏం చేయాలనే మీమాంశలో ఉన్నారు. అయితే ఈ అంతస్తులో ఆసుపత్రి సూపరింటెంటెండ్ తప్ప ఏవీ ప్రారంభించలేదు. ఇదే భవనం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో నిర్మించి ఉంటే ఆసుపత్రి రూపు రేఖలు మారిపోయేది.ఇక ఈ ఆసుపత్రిలో రెండవ అంతస్థుకు లిఫ్ట్‌ను పొందుపరచారు.కానీ నిధులు సరిపోలేదని గుంత కొట్టి వదలి పెట్టారు.

నాసిరకం పనులపై ఎందుకు చర్యల్లేదు:

ఈ భవనాలకు సంబంధించి కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆరోపిస్తూనే ఉన్నారు.కానీ అధికారులు ఎందుకు విచారణ జరపటం లేదు? ఇందులో ఉన్నతాధికారులు భాగస్వాములా? లేక కాంట్రాక్టర్‌తో మిలాఖత?ఇలా ఎన్నో ప్రశ్నలు ఎదురౌతున్నాయి.ఐదేళ్ళు నిర్మాణం సాగి రెండేళ్ళుగా ప్రారంభించక పోవటంపై విమర్శలున్నా కనీసం విచారణ జరగలేదంటే ఈ కుంభకోణంలో ఎవరెవరు? భాగస్వాములు అనేది తేలాల్సా ఉంది. అయితే ఓటిలో పార్టిషియన్‌కు స్థానికంగా ఉన్న ఓ కార్పొరేట్ ఆసుపత్రి నిర్వాహకుల్ని భాగస్వాముల్ని చేసారు.అంతేకాక ఆసుపత్రిలో అత్యాధునిక సదుపాయాలకు కృషి చేస్తున్నారు.

సర్జన్ లేక ...

శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో సర్జన్‌లేక ఆపరేషన్లకు తెరపడింది. సర్జరీలు జరిగితే వార్డులు ఫుల్ అవుతాయి. ఇక్కడ పని చేస్తున్న సర్జన్ గత నెల నుంచి అనధికారికంగా రావటం లేదని తెలిసింది.ఉమ్మడి జిల్లాలో ఒక్క రుయా ఆసుపత్రిలో తప్ప మరెక్కడా సిటి స్కాన్‌లు లేదు.ఎక్స్‌రే గది ఉంది కానీ ఇక్కడ లెటెస్ట్ యంత్రం లేదు.డిఆర్ ఎక్స్‌రే యంత్రం లేదు.ఇక్కడ నెలకు 2వేల ఎక్స్‌రేలు తీస్తున్నారు.సిఆర్ అన్ని చోట్ల ఉంది కానీ శ్రీకాళహస్తిలో లేదు.ఆసుపత్రిలో సివిల్ సర్జన్ లేదు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ లేదు. గైనకాలజీ ఉద్యోగి లేదు.స్టాఫ్‌న ర్సులు 24 మంది ఉండాల్సి ఉండగా 21 మంది మాత్రమే ఉన్నారు. ఇఎన్‌టి,ఆర్థో డాక్టర్లు జవాబుదారి తనంతో పని చేసే డాక్టర్లున్నారు. కానీ వారికి సరైన యంత్రాల్లేదు.

సూపరింటెండెంట్ వివరణ:

శ్రీకాళహస్తి ఆసుపత్రిలో సమస్యలకు సంబంధించి సూపరింటెండెంట్ డాక్టర్ మురళీని వివరణ కోరగా ఆయన ఇలా తెలిపారు.గతంలో హెచ్‌డిఎస్ ఫండ్స్‌రూ.5లక్షలు మంజూరు చేసే వారు కానీ ఈ ఏడాది ఈ నిధులు కూడా మంజూరు చేయలేదు.డాయాల్సిస్ కేంద్రంలో నేడు సమర్థవంతంగా నడుస్తుంది. ఆర్థోకు సంబంధించిన యంత్రాలను కొనుగోలు చేసాము. శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి చొరవతో పలువురిని భాగస్వాముల్ని చేస్తూ అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారు.సిటి స్కాన్ మరే ఆసుపత్రిలో లేదు. ఉంటే బాగుంటుంది.ఇక నాణ్యత లోపానికి సంబంధించి తాము పిర్యాదు చేస్తున్నామన్నారు.

సమష్టిగా రథసప్తమి విజయవంతం

-సదుపాయాలపై భక్తుల పరవశం -టిటిడి అధికారుల ఐక్యతారాగం

తిరుమల,జనవరి 27ప్రభాతవార్తప్రతినిధి:
ముందెన్నడూ లేనివిధంగా ఒకేరోజు శ్రీవారి ఏడువాహనాల సేవలను ,సమష్టిగా అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించామని టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఈఓ చిరూమామిళ్ళ వెంకయ్యచౌదరి వెల్లడించారు.ఒక్కరోజు బ్రహ్మోత్సవాన అశేషంగా తరలివచ్చిన 3.45లక్షలమంది సామాన్యభక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు, అన్ని శాఖలు సమన్వయంతో సమష్టిగా సేవలందించాయని పేర్కొన్నారు. టిటిడి పాలకమండలి,అనుభవజ్ఞులైన అధికారులతో కలసి మినీబ్రహ్మోత్సవం విజయవంతంగా నిర్వహించడంపై మంగళవారం మధ్యాహ్నం అన్నమయ్యభవనంలో ఈఓ సింఘాల్, అదనపు ఈఓ వెంకయ్యచౌదరి,తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్‌ఓ కెవి మురళీకృష్ణ మీడియాప్రతినిధులతో మాట్లాడారు. ఈ ఏడాది రథసప్తమిని దిగ్విజయం చేసిన టిటిడి అర్చకులు, సీనియర్ అదికారులు, ఉద్యోగులు, వాహనమోతదారులు, జిల్లా అధికారులు, పోలీస్ యంత్రాంగం, శ్రీవారిసేవకులు,భక్తులకు, మీడియాకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. దేశం నలుమూలల నుండి విచ్చేసిన లక్షలాదిమంది భక్తులకు ఏడు వాహనసేవలతోబాటు మూలవిరాట్టు దర్శనం ప్రశాంతంగా ,సంతృప్తిగా కల్పించాగలిగామన్నారు. అందరి అధికారులతో కలసి గ్యాలరీలను పరిశీలించడం, గ్యాలరీల్లో భక్తులతో మాట్లాడటం, వారికి సేవలందించడం అనుభూతి నిచ్చిందన్నారు. టిటిడి కల్పించిన సౌకర్యాలు,ఏర్పాట్లపై కూడా భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. గ్యాలరీల్లో చెత్తపేరుకుపోకుండా 590మంది పారిశుధ్యసిబ్బంది నిరంతరాయంగా సేవలందించారన్నారు. ఈ మీడియా సమావేశంలో తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్, సిఐ హరిప్రసాద్, విఎస్‌ఓ అల్లం సురేంద్ర, టిటిడి సిపిఆర్‌ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్‌ఓ నీలిమ, డిప్యూటీ ఈఓలు భాస్కర్, సోమన్నారాయణ, ఆలయ పేష్కార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెండువేల మొక్కలు నాటేందుకు చర్యలు : కమీషనర్



కుప్పం, జనవరి 27 ప్రభాతవార్త సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పం మున్సిపాలిటీలో అవెన్యూ ప్లాంటేషన్ కింద రెండువేల మొక్కలు నాటి వాటి స ంరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం రాత్రి నుంచి వేకువజామున ఐదు గంటల దాకా ఆయన కుప్పం పట్టణం విజలాపురం సర్కిల్ నుంచి పాతపేట, ఏరియా ఆస్పత్రి సర్కిల్ దాకా పారిశుద్ధ్య పనులు చేయించడంతో పాటు మొక్కలు నాటేందుకు కార్మికులతో గు ంతలు తవ్వించారు. ఈసందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ కుప్పం పట్టణాన్ని సుందరపట్టణంగా మలచేందుకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే ప్రధాన రోడ్లలో బటర్ఫ్లై ఎల్ఇడి లైట్లు, మొక్కలు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు.

మహిళలు ఆరోగ్యసంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

కుప్పం, జనవరి 27 ప్రభాతవార్త మహిళలు తమ ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన నీలా జగదీష్ కోరారు. బెంగళూరులో జరిగిన రొమ్ము కేన్సర్ అవగాహన ర్యాలీ పింకథాన్‌లో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు చిన్నతనం నుంచే వివిధ రకాల కేన్సర్లపై అవగాహణ పెంచుకోవాలని సూచించారు. రోజూ మహిళలు కనీసం కొంతసమయం నడక, వ్యాయామం చేయడంతో పాటు మానసికంగా ప్రశాంతంగా ఉండాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం మహిళలు కృషి చేయాలని కోరారు.

సిఎం పర్యటనకు హెలిప్యాడ్ సిద్ధం

శాంతిపురం, జనవరి 27 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు ఈనెలాఖరులో కుప్పంలో పర్యటి ంచనున్నారు. దీ ంతో సిఎం వచ్చే హెలికాప్టర్ నిలిచేందుకు గాను తుమ్మిశి వద్దగల హెలిప్యాడ్‌ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. హెలిప్యాడ్ పరిసరాలను శుభ్రం చేయిస్తున్నారు.

ఉద్యోగుల సమ్మెతో మూతపడ్డ బ్యాంకులు

కుప్పం, జనవరి 27 ప్రభాతవార్త వివిధ డిమాండ్ల సాధన కోసం బ్యాంకు ఉద్యోగుల యూనియన్లు ఇచ్చిన పిలుపు మేరకు కుప్పంలోని పలు బ్యాంకులు మూతపడ్డాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పనిదినాలు కల్పించాలని ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని వారు పేర్కొన్నారు. ఇకపై అన్ని శనివారాలు బ్యాంకులకు సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

శాంతిపురంలో ఆరుమంది అధికారులకు అవార్డు

శాంతిపురం, జనవరి 27 ప్రభాతవార్త మండలంలో పనిచేస్తున్న ఆరుమంది అధికారులు గణతంత్రది నోత్సవ వేడుకల సందర్భంగా అవార్డులు అందు కున్నట్లు ఎంపిడిఒ పిఆర్ కుమార్, తహశీల్దార్ ప్రకాష్ బాబు తెలిపారు. నాగేం ద్రకుమార్ (ఎఇ), ఆరిఎ బాషా(డిఎ), రాఘవేంద్ర, ఉదయ్‌కుమార్ (డబ్ల్యుఎ), శివాజి (విఇఎ), కిషోర్‌కుమార్ (జెఎ)లు ఉన్నారు. వారిని ఎంపిడిఒ, తహశీల్దార్ అభినందించారు.

విద్యార్థులు చెడుఅలవాట్లకు దూరంగా ఉండాలి

గుడుపల్లె, జనవరి 27 ప్రభాతవార్త విద్యార్థులు చెడుఅలవాట్లకు దూరంగా ఉండాలని రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ సూచించారు. మంగళవారం యామనూరు హైస్కూల్‌లో ఆయన విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు విద్యపై మక్కువ చూపాలన్నారు. అలాగే క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు సెల్‌ఫోన్లను మితంగావాడితే ఎంతో మంచిదని సూచించారు. నైతిక విలువలపై అవగాహన పెంచుకోవడం పాటు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో తల గాయాలతోనే ప్రాణ నష్టం

చిత్తూరు, జనవరి 27 ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయం తగలడంతోనే అత్యధికులు ప్రాణాలు కొల్పో తున్నారని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. చిత్తూరు చర్చివీధిలో మంగళవారం హెల్మెట్‌ధారణపై ద్విచక్రవాహనదారులకు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే ప్రమాదాలను కట్టడి చేయవచ్చునన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం, వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి అంశాలపై ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. చిన్న నిర్లక్ష్యంతో పెద్ద నష్టం జరుగు తుందనే విషయంను ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. హెల్మెట్‌ధారణతో ప్రమాదంను పూర్తిగా నివారిం చకపోయినా ప్రాణనష్టం సంభవించే అవకాశంను గణనీయంగా తగ్గించడానికి అవకాశం వుంటుందన్నార

అమ్మాయిలకు మంచి-చెడుపై చిన్న వయస్సులోనే అవగాహన

చిత్తూరు, జనదరి 27 ప్రభాతవార్త: పాఠశాల విద్యార్థినిలకు చిన్నతనం నుండి మంచి-చెడు తెలిసేలా అవగాహన కలిగి వుండాలని మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ చిన్నరెడ్డప్ప అన్నారు. చిత్తూరు కస్తూరిభా పాఠశాలలో మంగళవారం మహిళా స్టేషన్ ఎస్ఐ చిన్నరెడ్డప్ప విద్యార్థినిలకు ధైర్య స్థర్థ, గుడ్‌టచ్-బ్యాడ్ టచ్, బాల్య వివాహ నిరోధక చట్టం, హెల్ప్‌లైన్ నెంబర్ల వినియోగం, శక్తియాప్ తదితరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా స్టేషన్ ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ను గుర్తించగలగాలన్నారు. ఎవరైనా అనవసరంగా తాకితే, అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే నో అని చెప్పి నమ్మకైన గురువు లేదా తల్లిదండ్రులకు చెప్పాలన్నారు. అలాగే 18 సంవత్సరాలు పూర్తి కాకుండానే బాలికలు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలా చేయడం వల్ల చదువు ఆగిపోవడం, ఆరోగ్య సమస్యలు తలెత్తడం, భవిష్యత్తు దెబ్బతినే అవకాశం వుందన్నారు. అలాగే ఫోక్సో చట్టం కఠినమైనదని, 18 సంవత్సరాలలోపు పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులు జరిగితే కఠిన శిక్షలు వుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత

రామకుప్పం, జనవరి 27 ప్రభాతవార్త

డ్రగ్స్ నిర్మూలనతోనే ప్రజా ఆరోగ్యం మెరుగుపడుతుందని విజాలాపురం ప్రాథమిక ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పూజిత, హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు రమేష్ పేర్కొన్నారు. మంగళవారం విజలాపురం లో డ్రగ్స్ నిర్మూలన మన బాధ్యత కార్యక్రమం నిర్వహించి ర్యాలీ చేపట్టారు. విద్యార్థుల దేశంలోనే చెడు అలవాటులకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ కృష్ణారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ బాలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే కోడూరు డివిజన్

స్మశానం భూమిని కాపాడాలి

పెనగలూరు జనవరి 27 ప్రభాతవార్త తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం మండలంలోని ఈటిమాపురం గ్రామంలో నివసిస్తున్న మాల మాదిగ కులస్తులకు ప్రభుత్వం కేటాయించిన స్మశానం భూమిని దురాక్రమనకు గురికాకుండా కాపాడాలని మంగళవారం ఈట మార పురం ఎస్సీ కులస్తులు తాసిల్దారు అమరేశ్వరీ కి వినతి పత్రం ఇచ్చారు. తరతరాలుగా ప్రభుత్వం చూపించిన స్మశానం భూమిలో 20 ఏళ్ల క్రిందట ఉపాధి హామీ పథకంలో మట్టి తోలకం పనులు కూడా చేపట్టామన్నారు ఈ రెండు కాలనీలకు సంబంధించి దాదాపు 40 సంవత్సరాలు ఉన్నాయని తమ స్మశా నంలో కంపచెట్లు ముళ్ళపదలు చీకు చెట్లను శ్రమదానంతో శుభ్రం చేసుకుందామని స్మశానం జాగా శుభ్రంగా కనపడడంతో గ్రామంలోని కొంతమంది వ్యక్తులకు కన్ను పడి కబ్జా చేయడానికి చూస్తున్నారని ఈ సందర్భంగా తాసిల్దార్ ముందు వాపోయారు. తాసిల్దారు వీఆర్వో మధు తో మాట్లాడి దళితుల స్మశానం జోలికి ఎవరు వెళ్లకుండా చూడాలన్నారు ఇంకెవరికైనా స్మశానానికి జాగా కావాలంటే మరొక ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా దళితులు మరలా మాట్లాడుతూ దళితుల స్మశానం ప్రక్కనే కావలసినంత ప్రభుత్వ జాగా ఉందని తాము శుభ్రంగా ఉంచుకున్న స్మశానంపైనే వారి కన్ను పడి ఉందని అల్పులమైన తమ ఆవేదన అర్థం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

రేణిగుంట అభయ క్షేత్రంలో అన్నదానం

పెనగలూరు జనవరి 27 ప్రభాతవార్త రేణిగుంటలోని అభయ క్షేత్రం ఆశ్రమంలో నివసిస్తున్న అనాథలకు శ్రీకృష్ణ యాదవ సంఘం ఇండియా కువైట్ సభ్యుల సహకారంతో సోమవారం ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు నల్లప ్రెడ్డి పల్లి నివాసి యాదవ సంఘం గౌరవ సలహా సభ్యుడు నూతేటి శంకర్ యాదవ్ తెలిపారు. ఇండియా కువైట్ యాదవ సంఘం ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు నాగినేని రమణయ్య యాదవ్ అధ్యక్షుడు తలుపుల లక్ష్మీనరసయ్య యాదవ్. ఉపాధ్యక్షుడు నాగనబోయిన శ్రీనివాసులు యాదవ్. తదితరులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

ఉచిత పిరమిడ్ ధ్యాన కేంద్రం

కల్లూరు, జనవరి 27, ప్రభాతవార్త ప్రులిచర్ల మండలంలోని పోసంవారిపల్లెలో ఉచిత ఆత్మ జ్ఞాన శిక్షణ విశ్వ శాంతి పిరిమెడ్ మాస్టర్ ఎం. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఆత్మజ్ఞాన శిక్షణ కార్యక్రమం పులిచర్ల, మొగరాల, కృష్ణా పురం, పాకాల, ఐరాల, కొమ్మిరెడ్డి గారిపల్లి, పలువురు ధ్యానులు పాల్గొన్నారు. పిరమిడ్ మాస్టర్లు వారి వారి అనుభవాలను, ధ్యాన సాధన, ప్రచారం శాఖాహార విశిష్టత సజ్జన సాంగత్యం నిర్వహించారు.

ఎల్లంకివారిపల్లి జడ్పిహెచ్ పాఠశాలకు రూ. 10 లక్షలు విరాళం

కల్లూరు, జనవరి 27, ప్రభాతవార్త ఎల్లంకి వారి పల్లిలో పూర్వ విద్యార్థి రాయవారిపల్లికి చెందిన కోదండరాంపిలై కుమారుడు జ్యోతీశ్వర్ పిలై 50 సంవత్సరాల ముందు విద్యనభ్యసించిన తన పాఠశాలకు గుర్తుగా పిల్లలు భోజనం చేయడానికి, కళావేదికు పది లక్షల రూపాయలను వెచ్చించి మినీ ఆడిటోరియం నిర్మించిడానికి ముందుకు వచ్చారు. ఈ సమావేశంలో గ్రామస్తులు రామనాథం నాయుడు, భాస్కర్ నాయుడు, శ్రీనివాస్ నాయుడు, మునిరత్నం, దొర, రిటైర్డ్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారి వేణు, జడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యులు, గోపి నాయుడు, జిఎం శంకర్, పార్థసారథి, వాసు, రాజా, పరందామ, భాస్కర నాయుడు, సుబ్రహ్మణ్యం, సురేంద్ర, కాశీమ్, మనోహర్, చంద్రశేఖర్, మునికృష్ణ, అంజి గ్రామస్తులు అందరూ కలిసి పాఠశాలను పర్యవేక్షించారు.

మోడల్ స్కూల్‌లో ఘనంగా వార్షికోత్సవం

యర్రావారిపాలెం, జనవరి 27, ప్రభాతవార్త: మండలంలోని ఏపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌బి. సరళ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ అధికారులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాల వార్షికోత్సవ నివేదికను సమర్పించారు. తర్వాత అధికారులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చక్కగా చదువుకోవాలని సూచించారు. మధ్యాహ్నం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ ఎంపిడిఒ, మండల విద్యాశాఖ అధికారులు వెంకట బాలసుబ్రమణ్యం, సతీష్ బాబు, మెడికల్ ఆఫీసర్ లీనా కుమారి, ఎస్ఎంసి చైర్మన్ ఉదయ్ కుమార్, మండల పార్టీ ప్రెసిడెంట్ రఘునాథ్, మండల జనరల్ కార్యదర్శి మహేష్ నాయుడు, పాఠశాల కో అప్ టెడ్ మెంబర్ బాలకృష్ణమ నాయుడు, సర్పంచ్ సుబ్రమణ్యం, ఎస్ఎంసి వైస్ చైర్మన్, కమిటీ సభ్యులు, మెడికల్ పిహెచ్‌సి సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, జనవరి 27 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు మంగళవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు అనంతపురంకు చెందిన రామచంద్రరావు అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్‌కు డీడీరూపంలో అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ వాసు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత తిరువణంపల్లె టీం

కాణిపాకం, జనవరి 27 ప్రభాతవార్త: కాణిపాకం యూత్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో తిరువణంపల్లె టీం విజేతగా నిలిచింది. ప్రతి ఏటా వలె కాణిపాకం యూత్ ఆధ్వర్యంలో చిగరపల్లె క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఆర్గనైజర్ సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈపోటీల్లో ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. ఇందులో తిరువణంపల్లె, చిగరలపల్లె జట్లు ఫైనల్ తలపడగా తిరువణంపల్లె జట్టు విజేతగా నిలిచింది. ఈమేరకు విజేత తిరువణంపల్లె జట్టుకు మండల బిసీ నాయకులు కాణిపాకంకు చెందిన ఎల్‌జి.బాల ప్రథమ బహుమతిగా 5,116 రూపా యలు, రన్నర్ జట్టుకు2,500రూపాయలనుఅందజేశారు. ఈకార్యక్రమంలోజట్టుకేప్టెన్‌నరేష్, క్రీడాకా రులు పాల్గొన్నారు.

కల్తీ చికెన్ విక్రయంతో ఆందోళన

పుంగనూరు జనవరి 27 ప్రభాతవార్త పట్టణంలోని రాతి మసీదు వీధిలోని ఒక చికెన్ సెంటర్లో కల్తీ చేసిన చికెన్ విక్రయించడంతో బాధితులు ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి రాతి మసీదు వీధిలోని జప్రూల్లా చికెన్ సెంటర్ నందు ఒక కుటుంబం తమ ఇంట్లో జరిగే కార్యక్రమం కోసం 40 కిలోల చికెన్ కొన్నారు. అయితే చికెన్ వండిన తర్వాత ఒక్కొక్కటి ఒక్కొక్క విధంగా రుచులు రావడంతో ఈ విషయమై జప్రూలా చికెన్ సెంటర్ యాజమాన్యాన్ని వాళ్ళు ప్రశ్నించారు. చికెన్ సెంటర్ యాజమాన్యం సరే సమాధానం ఇవ్వకపోగా అక్కడ పనిచేసే వ్యక్తులు దౌర్జన్యానికి దిగారు. ప్రశ్నించిన చికెన్ కొనుగోలుదారులను పోలీసులు తమ వెంట తీసుకువెళ్లారు. అయితే ఈ విషయమై హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

మల్లానూరు - తమిళనాడు రోడ్డుకు 18.30కోట్లు మంజూరు

కుప్పం, జనవరి 27 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప ్పంలోని మల్లానూరు - తమిళనాడు రోడ్డుకు 18.30కోట్ల నిధులు మంజూరు చేస్తూ పరిపాలనపరమైన ఉత్తర్వులను ప్రభుత్వ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి ఎంటి కృష్ణబాబు ఉత్తర్వుఉ జారీ చేశారు. ఈ నిధులతో మల్లానూరు నుంచి అడవిబూదుగూరు మీదుగాతమిళనాడురాష్ట్రం సరిహద్దు వరకు సుమారు 7.2కి.మీ.మేర నూతనంగా తారురోడ్డును నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.

సిఎం పర్యటన ప్రాంతాల పరిశీలన

కుప్పం, జనవరి 27 ప్రభాతవార్త సిఎం చంద్రబాబు నాయుడు కుప్పం పర్యటన ఖరారైన నేపథ్ యంలో మంగళ వారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్ బాబు సిఎం పర్యటన ప్రాంతాలను పరిశీలించారు. హెలి ప్యాడ్, సిఎం బహిరంగ సభ ప్రాంతాలు పరిశీలించారు. అక్కడ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

ఇ సైకిల్ రిజిస్ట్రేషన్ వేగవంతం

రామకుప్పం, జనవరి 27 ప్రభాతవార్త టిడిపి పార్టీ కార్యాలయంలో ఇ సైకిల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం వేగవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి కోరారు. 35 వేలు విలువ చేసే ఇ సైకిల్ లను సబ్సిడీ ద్వారా 23,999 రూపాయలకే స్వయం సహకారం సంఘ మహిళలకు మొదటి నగదుగా 5 వేల జమచేసి నెలవారీగా రుణాన్ని జమ చేసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామరాజు నాయక్, భాస్కర్, ఆదిల్, దివాకర్, మురళి ,వెంకటరమణ, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి ఆసుపత్రిని తనిఖీ చేసిన వైద్యాధికారి

బైరెడ్డిపల్లి, జనవరి 27 ప్రభాతవార్త : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి టి సుధారాణి బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. టాటా సంజీవిని,డిజిటల్ నర్స్ సెంటర్ అమలు చేయుట గురించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. మరియు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్,అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్, కాన్పుల గది, ల్యాబ్ పరిసరములు తనిఖీ చేశారు.

రాష్ట్ర స్థాయి విజేతలకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో అభినందనల సత్కారం

పెనగలూరు, జనవరి 27 ప్రభాతవార్త తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ విజయవాడలో నిర్వహించిన రంగోత్సవం-2026 పోటీలలో పెనగలూరు మండలం నల్లపురెడ్డి పల్లె విద్యార్థినులు తృతీయ బహుమతిని సాధించారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థినులు ఝాన్సీ, హిమజ, తులసి మరియు మేనకలను, వారి తల్లిదండ్రులను యుటిఎఫ్ పెనగలూరు మండల శాఖ ఆధ్వర్యంలో మెమెంటో, దుశాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు కె. క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు బి.హరిప్రసాద్ మాట్లాడుతూ మంచి కళా నైపుణ్యంతో దేశాభివృద్ధి, సాంకేతికత మరియు సంస్కృతిని మేళవిస్తూ వారు వేసిన ఈ ముగ్గులు పోటీల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని అభినందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు యం. సతీష్, జి. వాణి, డి.పద్మశ్రీ, నజీమ్, సురేంద్ర, ప్రమోద్ కుమార్ రెడ్డి, గైడ్ ఉపాధ్యాయులు రవిశంకర్ రెడ్డి, మరియు పాఠశాల ఉపాధ్యాయులు నరసింహులు,శ్యామ్ సుందర్, చంద్రమోహన్, విజయ్ కుమార్, వెంకట సుబ్బయ్య, క్రిష్ణరెడ్డీ, శేషపాణి, లక్ష్మీదేవి, అమర్, రెడ్డి బాబు ,సుబ్బరాయుడు, హరి నాథ్,లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సాంకేతిక పద్ధతులను పాటించాలి

పుల్లంపేట, జనవరి 27 ప్రభాతవార్త:

మండల పరిధిలోని వత్తలూరు రైతు సేవ కేంద్రంలో వత్తలూరు రెవెన్యూ పరిధిలోని రైతులకు మంగళవారం ఒక రైతుకు రెండు బస్తాలు యూరియాను మండల వ్యవసాయ అధికారి ఎస్.ప్రవీణ్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు సాంకేతిక పద్ధతులను పాటించాలన్నారు. ఎక్కువగా యూరియా వాడటం వలన పంటలకు అంత మంచిది కాదన్నారు నత్రజని ఎరువులు అధికంగా వాడటం వలన రసం పీల్చే పురుగులు ఉధృతి ఎక్కువగా ఉంటుందని, దీంతో తెల్ల దోమ వంటి చీడపీడలు పంట పొలాలని ఆశిస్తాయని, దీంతో పంటలు ఏపుగా పెరిగి సున్నితంగా తయారవుతాయని ఈ విధంగా పంట దిగుబడులపై ప్రభావం చూపుతాయని అన్నారు. రైతులు వరి నాట్లు వేసేటప్పుడు సాంప్రదాయ పద్ధతులు కాకుండా సాంకేతిక పద్ధతులను పాటించి అధిక దిగుబడును సాధించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు రెడ్డి ప్రవీణ్ విష్ణు కాంత్ రైతులు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

ప్రభుత్వ పాఠశాలల్లోనే సమగ్ర వికాసం

– జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్

బంగారుపాళ్యం, జనవరి 27 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సమగ్ర వికాసం దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖ అదికారి రాజేంద్రప్రసాద్ అన్నారు. బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన వార్షికోత్సవ కార్యక్రమానికి డిఇఓ రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం వున్న ఉపాధ్యాయులు విద్యాబోధన చేయడం వల్ల విద్యార్థులకు సమగ్ర వికాసంతో వృద్ధి చెందుతారన్నారు. బంగారుపాళ్యం ఉన్నత పాఠశాలకు ప్రత్యేక స్థానం జిల్లాలో వుందని, ఈ పాఠశాల నందు విద్యతో పాటు క్రీడలు సైతం విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. జిల్లా సమగ్రశిక్ష అభియాన్ పిఓ వెంకటరమణ మాట్లాడుతూ రానున్న టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ రాజేంద్రన్, తహసిల్దారు షబ్నీర్‌భాషా, మండల విద్యాశాఖ అధికారి రమేష్, ఎస్టీఓ ప్రసన్న, సిఐ శ్రీనివాసులు, సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి, నాయకులు హేమచంద్ర, కోదండయాదవ్, రాధాకృష్ణ, జనార్ధన్, సురేంద్ర, ఇన్‌ఛార్జిహెడ్మాస్టర్‌జనార్ధన్‌రెడ్డి, పలువురుఉపాధ్యాయులు, విద్యార్థులుపాల్గొన్నారు.

15వేల లంచం ఇస్తేనే రికార్డులు మార్చుతాం

– విఆర్వో తీరుపై వృద్ధురాలి ఆవేదన !!

శాంతిపురం, జనవరి 27 ప్రభాతవార్త తన భర్తపై ఉన్న భూరికార్డులను తనపేరిట మార్చాలని ఓ వృద్ధురాలు విఆర్వోను ఆ శ్రయిస్తే ఆయన ఏకంగా పదిహేను వేల రూపాయలు డిమాండ్ చేయడంతో నాలుగునెలలుగా డెబ్బై ఏళ్ల వృద్ధురాలు రెవెన్యూ కార్యాలయం,విఆర్వో చుట్టూ తిరుగుతోంది. మండలంలోని చిన్నారి దొడ్డి గ్రామంకు చెందిన మంగమ్మ (70)తన భర్త గోపాల్‌రెడ్డి మృతి చె ందడంతో అతనిపై ఉన్న 2.7 ఎకరాల భూమిని తన పేరిట మార్చుకునేందుకు అవస్థలు పడుతోంది. మంగళవారం ఆమె తన గోడును 'ప్రభాతవార్త' ఎదుట వెలిబుచ్చింది. భూమి రికార్డులుమార్చేందుకు ఇదివరకే తనకు వచ్చే పింఛను సొమ్ములో 3వేలు విఆర్వో కు,1500రూ.లు సర్వేవారికి ఇవ్వగా కేవలం సర్వేమాత్రం చేశారని వాపోయింది. ఈ విషయాన్ని ప్రభాతవార్త తహశీల్దార్ ప్రకాష్‌బాబు దృష్టికితీసుకెళ్లగా వృద్ధురాలి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని విఆర్వోపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎవరైనా ఇలాంటి అక్రమాలకు పాల్పడితేకఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అప్పటికప్పుడు తహశీల్దార్ స్పందించి అక్కడే ఉన్న తలారి ద్వారామంగమ్మనుమీ-సేవకేంద్రానికిపంపారు. దీంతోవృద్ధురాలు ప్రభాతవార్తకు ధన్యవాదాలు తెలిపింది.

ఘనంగా జాతీయ ఎలక్ట్రిషన్ డే వేడుకలు

పుంగనూరు రూరల్, జనవరి 27 ప్రభాతవార్త జడ్పీ హా

తిరుపతి డివిజన్

కబ్జాదారుల పట్ల కనికరమెందుకో?

శ్రీకాళహస్తి,జనవరి 27 ప్రభాతవార్తశ్రీకాళహస్తి రెవెన్యూ అధికారుల తీరు రోజు రోజుకు తీసికట్టుగా మారుతుందని సిపిఎం శివమెత్తింది. మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. శ్రీకాళహస్తి మండలంలోని అమ్మ చెరువు ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేసిన వ్యక్తుల పట్ల రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్న తీరు బాధాకరంగా ఉందని ఆరోపించారు.ఈ మేరకు మంగళవారం తిరుపతిజిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు,ఏరియా కార్య దర్శి గంధం మణిలు మాట్లాడుతూ అమ్మచెరువు గ్రామ రెవెన్యూలెక్కల దాఖలా సర్వేనెంబర్ 9,10,11లో ఉన్న 6 ఎకరాల ప్రభుత్వ భూమిని వెంకటగిరికి చెందిన ఓ భూస్వామి అక్రమించుకొని దర్జాగా అనుభవిస్తూ పంటలు పండించుకుంటుండగా అధికారుల ఉదాసీన వైఖరి వెనుక ఆంతర్య మేమిటని ప్రశ్నించారు. అంతేకాకఈభూస్వామిచెరువునుకూడాఆక్రమించుకున్నా అధికారులు పట్టించుకోవటం లేదని ధ్వజమెత్తారు.

ఆర్‌టిసి బస్టాండును మార్చాలా? మోడల్‌గా మార్చాలా?

శ్రీకాళహస్తి,జనవరి 27 ప్రభాతవార్తశ్రీకాళహస్తి పుణ్య క్షేత్రంలోని అతి పురాతనమైన ఆర్‌టిసి బస్టాండును ఇక్కడ నుంచి మార్చాలా? లేక మోడల్‌గా తీర్చి దిద్దాలా? అనే అంశాన్ని త్వరలోనే నిర్ణయిస్తామని శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్‌టిసి బస్టాండులోని ప్రయాణీకుల సౌకర్యార్థం స్వచ్ఛమైన మంచినీటిని అందించుటకు ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొదటి బస్టాండుగా వివరించారు. 1979లో ప్రారంభించిన బస్టాండుకు 55 సంవత్సరాలు నిండాయన్నారు.ఎక్కడ చూసినా పెచ్చులూడుతున్నాయన్నారు.ఈ సమస్యకు సంబంధించి గతంలో సంబంధిత మంత్రితో మాట్లాడానన్నారు. పట్టణ నడిబొడ్డులో బస్టాండు ఉండటం వల్ల ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. అంతేకాక కొందరు డ్రైవర్లు పట్టణంలోని బిక్షాల గాలిగోపురం నుంచి జలవినాయక ఆలయం వైపు వెళ్ళటం వల్ల సన్నిధివీధిలో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతుందన్నారు. ఆర్‌టిసి డ్రైవర్లు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జిలు కంఠారమేష్, గోపినాథ్,పేట బాలాజి,ఆర్‌టిసి డిపో మేనేజర్ రేవతి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని నీరుగారిస్తే సహించం

శ్రీకాళహస్తిరూరల్, జనవరి 27 ప్రభాతవార్త మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయటానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని అదే జరిగితే ఉద్యమాలు తప్పవని సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మండలంలోని వేదాం పంచాయతీలో పర్యటించి పరిశీలించారు. ఇక్కడ ఉపాధి హామీ పనులు చేస్తున్న కార్మికులతో కలసి చర్చించారు. 2014లో ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఉపాధి హామీ చట్టాన్ని నీరు కార్చే విధంగా చూస్తున్నారన్నారు. ఇప్పుడు మహాత్మాగాంధీ పేరును మార్పు చేసి గాంధీని చంపిన గాడ్సే వారసులను కాషాయ శక్తులను సంతృప్తి పరచటానికే ఈ పథకాన్ని మార్పులు చేయటం జరుగుతుందన్నారు. మురళితో పాటు సిపిఐ నాయకులు జనమాల గురవయ్య, మించల శివకుమార్, రోడ్డ గోపి, చారులత తదితరులు పాల్గొన్నారు.

శివయ్య సేవలో అస్ట్రాలజర్ వేణుస్వామి

శ్రీకాళహస్తి,జనవరి 27 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరస్వామిని ప్రముఖ అస్ట్రాలజర్ వేణు స్వామి తనకుటుంబసభ్యులతో మంగళవారం దర్శించుకున్నారు.ఆయనకు మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు బుల్లెట్ జయశ్యామ్ రాయల్ స్వాగతం ఏర్పాటు చేసారు. దక్షిణ గోపురం వద్ద వారికిఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల అంతరాలయం దర్శనం చేసుకున్న ఆయనకు మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. బుల్లెట్ శ్యాం వారికి స్వామి అమ్మవార్లచిత్రపటాలను అందించారు. బుల్లెట్‌శ్యాంతో పాటు దినేష్,సోహైల్, ఇర్ఫాన్ తదితరులున్నారు.

లోబావిలోని దేవస్థానం అతిథి గృహాలకు వైఫై సదుపాయం:

శ్రీకాళహస్తి,జనవరి 27 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న 125గదుల సత్రాలకు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి చొరవతో భక్తుల సౌకర్యార్థం చరవాణి పని చేయటానికి 'వై ఫై' సదుపాయం కల్పించారు. అతిథిగృహాలు ప్రారంభించి ఐదేళ్ళు అయినా ఇక్కడ బస చేసే భక్తులకు చరవాణి పని చేయక తిప్పలు పడుతున్నారు.దాంతో చాలా మంది ఇక్కడ బస చేయటానికి సుముఖత చూపటం లేదు. ఈ సమస్యను పరిష్కరించుటకు ఇఓ బాపిరెడ్డి సెల్ టవర్లను ఏర్పాటుకు కృషి చేసారు.కానీ శాఖా పరమైన వారు అనుమతించలేదు. దాంతో ఇఓ ఇక్కడ వైఫై సదుపాయం కల్పిస్తూ చర్యలు తీసు కున్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి జనవరి 27 ప్రభాతవార్త శ్రీకాళహస్తి పట్టణంలోని 13వ వార్డు ముత్యాలమ్మ గుడివీధిలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద ఘటన స్థలాన్ని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సంఘటన దురదృష్ట కరమన్నారు. సంఘటనకు సంబంధించి బాధితులు ఎంఎల్‌ఏకు వివరిస్తూ ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ వల్ల గ్యాస్ లీకై మంటలు చెలరేగడం, ఇంటి సామాగ్రి దెబ్బతినడం దురదృష్టకరమైన ఈ సంఘటన బాధాకరమన్నారు.ఎంఎల్‌ఏ బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పి తనవంతు తక్షణ సాయంగా రూ. 20,000 (ఇరవై వేల రూపాయల) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయనతోపాటు మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, టౌన్ బ్యాంక్ చైర్మన్ షేక్ ఖాదర్బాషా ట్రస్ట్ బోర్డ్ మెంబెర్ వాక్చర్ల గుర్రపు శెట్టి, జిలాని తదితరులు ఉన్నారు.

తిరుపతిలో మెగా ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

తిరుపతి రవాణ, జనవరి 27 ప్రభాత వార్తజాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని రాయలసీమ జోన్ ప్రాంతీయ సంయుక్త రవాణా కమిషనర్ కృష్ణవేణి ప్రారంభించారు. డాక్టర్ బి.ఎన్.రెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సౌజన్యంతో , స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు, మందులు అందించారు.ఈ కార్యక్రమంలో ఎస్ బి ఐ రీజనల్ మేనేజర్ ఎస్. వెంకటేశ్వరరావు , బ్యాంక్ మేనేజర్లు దినకర్ గుణశీల, శివశంకర్, డాక్టర్ బి.ఎన్.రెడ్డి హాస్పిటల్ బృందం ,మోటార్ వాహనాల తనిఖీ అధికారులు సుబ్రహ్మణ్యం శ్రీనివాసరావు, అతికనాజ్, ప్రసాద్ వర్మ పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరం నేడు కూడా ఉంటుందని రవాణా శాఖ అధికారులు తెలియజేశారు.

సీఎంను కలసిన చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి

విజయపురం, జనవరి 27 ప్రభాతవార్త: సీఎం చంద్రబాబునాయుడుని మంగళగిరి టీడీపీ కార్యాలయంలో మంగళవారం చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి మునిభాస్కర్‌రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువలతో సత్కరించారు. పార్టీ నాపై నమ్మకం ఉంచి పదవి అందించారని, నా వంతు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆయనతో పాటు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఉన్నారు.

పన్నూరులో పాఠశాల వార్షికోత్సవం

విజయపురం, జనవరి 27 ప్రభాతవార్త: మండలంలోని పన్నూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు పాఠవాల వార్షికోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులుప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జానకిరామిరెడ్డి, ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్‌కు సత్కారం

విజయపురం, జనవరి 27 ప్రభాతవార్త: మండలంలోని కాళికాపురం వెల్ఫేర్ అసిస్టెంట్ శివానందంను మండలంలోని క్షూరికాపురం సర్పంచ్ శేఖర్, పంచాయతీ కార్యదర్శి సురేంద్ర కుమార్ శాలువలతో సత్కరించారు. ఆయన క్షూరికాపురంలో ఉత్తమ విధులు నిర్వహించినందుకు గాను ఉత్తమ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలాజీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముప్పన్నెల జెండాకు గౌరవ వందనం..!

చంద్రగిరి, జనవరి 27 ప్రభాతవార్త: ముప్పన్నెల జెండాకు యావత్ జాతి గౌరవ వందనంతో 77 గణతంత్ర దినోత్సవ పండుగ జరుపుకున్నారు. ఇందులో భాగంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ శివరామసుబ్బయ్య, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్ కొండారెడ్డి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ అమర్‌నాథరెడ్డి, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి, హీరా ఉర్దూ స్కూల్లో (మదర్సా) మేనేజర్ మొఘల్ అబ్దుల్ అజీజ్, ప్రిన్సిపాల్ జాన్ ముబారక్, చంద్రగిరి సబ్ డివిజన్ కార్యాలయంలో ఏడిఈ శేషాద్రి రెడ్డి, ఏఈలు వెంకటరమణ, విద్యాశాఖ (ఎంఆర్‌సి ఆఫీస్) కార్యాలయంలో ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఎంఈఓ 2 భాస్కర్‌బాబు, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శారద, శ్రీ పద్మావతీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వెంకరమణా రెడ్డి, పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ముద్దికుప్పం రూప రామమూర్తి, ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ దివాకర్, సబ్ ట్రెజరీ ఆఫీసర్ యోగానందరెడ్డి, సీనియర్ అకౌంటెంట్ కొల్లూరి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రభుత్వ ప్రశంసలు

చంద్రగిరి, జనవరి 27 ప్రభాతవార్త: విధినిర్వహణలో ఉత్తమ సేవలందించిన ముగ్గురిని ప్రభుత్వం

ప్రశంసలతో అభినందనలు తెలియజేసింది. చంద్రగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్, సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ సురేంద్ర, తిరుపతిలో జరిగిన రిపబ్లిక్ వేడుకలలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు చేతులమీదుగా ఎంఎల్ఏ పులివర్తి నాని, ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ గోవిందరావు సమక్షంలో ప్రశంసాపత్రంతో అభినందనలు అందుకున్నారు. అదేవిధంగా విద్యుత్‌శాఖ తిరుపతి జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్ రావు చేతుల మీదుగా చంద్రగిరి సబ్ డివిజన్ విద్యుత్ శాఖ ఏఈ నాగరాజు ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రశంసలందుకున్న అధికారులకు సర్వత్రా అభినందనలు లభించాయి.

రాజ్యశ్యామలాదేవికి కీర విమోచన సేవ

రామచంద్రాపురం, జనవరి 27 ప్రభాతవార్త:రాయలచెరువు సమీపంలో వెలసియున్న శ్రీశక్తిపీఠంలో మంగళవారం రాజ్యశ్యామలాదేవికి మాతాజీ రమ్యానంద భారతి క్షీర విమోచన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, లఘు శ్యామలా హోమం, సువాసినీ పూజ, దర్బారు సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పి ంచి, తీర్థప్రసాదాలు అందజేశారు.

8 నుండి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఫిబ్రవరి 5న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ,శ్రీనివాస మంగాపురంలో ఏర్పాట్లు షురూ

చంద్రగిరి, జనవరి 27 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో ఫిబ్రవరి 8 నుండి వాహనసేవలు ప్రారంభమవుతాయని టిటిడి పిఆర్‌ఓ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 5న ఉదయం 6.30 గంటల నుండి 11 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 7న సాయంత్రం అంకురార్పణ, 8న ఉదయం 8.15 గంటల నుండి 8.35 గంటల మధ్యన కు ంభలగ్నం నందు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని అన్నారు. ఫిబ్రవరి 8న రాత్రి పెద్ద శేష వాహనం, 9న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, 10న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహనం, 11న ఉదయం కల్ప వృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం, 12న ఉదయం పల్లకీ ఉత్సవం, రాత్రి గరుడ వాహన సేవ, 13న ఉదయం హనుమంత వాహనం, మధ్యాహ్నం వసంతోత్సవం, సాయంత్రం స్వర్ణరథం, రాత్రి గజవాహనం, 14న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 15న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 16న ఉదయం 9.55 నుండి 10.15 గంటల మధ్యన చక్రస్నానం, సాయంత్రం 6 గంటల నుండి 7 గంటల మధ్యన ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు.

కరంట్రోళ్ల జన బాట...

రేణిగుంట, జనవరి 27 ప్రభాతవార్త.. ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గంగాధర్ రెడ్డి ఆదేశాల మేరకు ఏడి రమేష్ బాబు సూచనలతో రూరల్ ఏఈ మల్లికార్జున్ ఆధ్వర్యాన రేణిగుంట మండలం జీ పాలెం పంచాయితీ పద్మానగర్, కొత్త కాలనీ లో మంగళవారం విద్యుత్ వినియోగదారులతో విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది విద్యుత్ కరెంట్ టోల్ల జన బాటలో భాగంగా మాటామంతి నిర్వహించారు. వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలున్న ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా పద్మా నగర్ నందు ఓ ఫీడర్ క్రింద ఉన్న విద్యుత్ సర్వీసులకు కొన్ని సమయాల్లో విద్యుత్ సరఫరా రావడంలేదని వినియోగదారులు ఏఈ మల్లికార్జున్ దృష్టికి తెచ్చారు. త్వరలో ఫీడర్ మార్చి విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ మురళి, లైన్ మాన్ శివకుమార్, జూనియర్ లైన్మెన్లు రాజేష్, బాలముని, పద్మా నగర్, కొత్త కాలనీ విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

స్టీవార్డెన్ మీద చర్యలు తీసుకోవాలి. ఎన్ఎల్ఎస్ప

తిరుపతి విద్య, జనవరి 27 ప్రభాత వార్త శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఎస్వియు కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నడుస్తున్న డిమెన్సులో దాదాపు 500 మంది విద్యార్థుల వరకు ప్రతిరోజు భోజనం చేస్తుంటారు. అయితే ఇక్కడ స్టీ వార్డెన్ గా విధులు నిర్వహిస్తున్న నాగముని అనే వ్యక్తి రోజు మద్యం తాగి విధులకు వస్తు,విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.ఇదేమిటని ప్రశ్నించిన న్యాయ విద్యార్థుల మీద దాడులకు దిగుతూ బెదిరింపులు కి గురి చేస్తున్నాడు. స్టీ వార్డెన్ నాగ ముని తక్షణమే తొలగించాలని న్యాయ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుధారాణి కి విద్యార్థులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్సిటీ అధ్యక్షుడు ప్రకాష్ మాట్లాడుతూ వర్సిటీలో కొందరు ఉద్యోగులు చేసే పనుల వల్ల యూనివర్సిటీ మొత్తానికి చెడ్డపేరు వస్తుందని, సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇదే మెస్ లో భోజనం చేసేవారని, అటువంటి మెస్సులో ఇలాంటి ఉద్యోగులు విధులు నిర్వహించడం చాలా బాధగా ఉందని, ఇదేమిటని కంప్లైంట్ ఇస్తే ఉన్నత అధికారులు మాత్రం విద్యార్థుల మీద నెపంతోస్తూ పబ్బంగడుపుతున్నారని తెలియజేశారు. తక్షణమే స్టీ వార్డెన్ నాగ ముని అక్కడి నుంచి తొలగించి విద్యార్థులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యోగేశ్వర్, భాగ్యమనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన జేఈవోను మర్యాదపూర్వకంగా కలిసిన వేదక్ వర్శిటీ రిజిష్ట్రార్

తిరుపతి విద్య, జనవరి 27 ప్రభాతవార్త తిరుమల తిరుపతి దేవస్థానం నూతన జేఈవో(విద్య, వైద్యం) గా బాధ్యతలు చేపట్టిన డా.శరత్ ఐఎఎస్‌ను వేద విశ్వవిద్యాలయ రిజిష్ట్రార్ డా. పోకల భాస్కరుడు మర్యాద పూర్వకంగా మంగళవారం జేఈవో ఆఫీసులో కలిసారు.ఈ సందర్భంగా జేఈవోకు విశ్వవిద్యా లయం గురించి ఇక్కడి విద్యా విధానం,విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు, అభివృద్ధి పనులు గురించి తెలియచేసారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్

తిరుపతి విద్య,జనవరి 27 ప్రభాత వార్త నేటి నుండి 30 వరకు ఎస్.వి. ప్రభుత్వ పాలిటెక్నిక్ రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ఘనంగా నిర్వహించబడనుంది.ఈ రాష్ట్రస్థా యి క్రీడా పోటీలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు తెలిపారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి పాల్గొనే బాలురకు ఎస్.వి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో,బాలికలకు శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ డా. ద్వారకానాథ రెడ్డి ఫిజికల్ డైరెక్టర్ రాజీవ్ మీడియాకు తెలిపారు. ఈ పోటీల్లో సుమారు 1500 మంది బాలురు ,బాలికలు పాల్గొననున్నట్లు వారు పేర్కొన్నారు.అలాగే ప్రాంతీయ సంయుక్త సంచాలకులు నిర్మల్ కుమార్, ప్రియ ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

గణతంత్ర దినోత్సవ పెరేడ్ లో ఎస్వీజేసి ఎన్ సి సి కాడెట్స్ ప్రతిభ

తిరుపతి విద్య, జనవరి 27 ప్రభాతవార్త 77వ గణ తంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీసు పెరేడ్ మైదానంలో జరిగిన తిరుపతి జిల్లా గణతంత్ర దినో త్సవ వేడుకల్లో శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాల ఎన్ సి సి కాడెట్స్ చేసిన కవాతు అందరిని ఆకర్షించి, ప్రశంసలు పొంది, ఉత్తమమైనదిగా ఎంపికయ్యి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఐ ఏ ఎస్ చేతుల మీదుగా మొదటి బహుమతి అందుకున్న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ సి సి సి ఓ ఈ. లోకేష్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పిఆర్ఎస్ఐ తిరుపతికి బెస్ట్ ప్రోగ్రామ్స్ జాతీయ అవార్డు

తిరుపతి కలెక్టరేట్, జనవరి 27 ప్రభాతవార్త పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పిఆర్ఎస్ఐ) తిరుపతి చాప్టర్ కు జాతీయస్థాయిలో బెస్ట్ ప్రోగ్రామ్స్ అవార్డు లభించింది. ఈ అవార్డును టీటీడీ చీఫ్ పిఆర్ఓ డాక్టర్ టి.రవి మంగళవారం చాప్టర్ ఛైర్మన్ డా.జి ఎస్.ప్రసాద్, కార్యదర్శి దుద్యాల చంద్రమోహన్, ఇతర కార్యవర్గ సభ్యులకు ప్రదానం చేశారు.పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఇటీవల ఉత్తరాఖండ్ లోని డెహ్రాడూన్ లో నేషనల్ కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సమావేశంలో పిఆర్ఎస్ఐ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ అజిత్ పాథక్, సెక్రటరీ జనరల్ డాక్టర్ పిఎల్ కే.మూర్తి, వైస్ ప్రెసిడెంట్ (సౌత్) యుఎస్.శర్మ కలిసి తిరుపతి చాప్టర్ కు బెస్ట్ చాప్టర్ అవార్డును ప్రకటించారు. డాక్టర్ టి.రవిని పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ కార్యవర్గ సభ్యులు మెమెంటో, శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు కె.శ్రీనివాసరావు, కోశాధికారి కె.మధుసూదన్, జాయింట్ సెక్రటరీ సంస్కార్ రాజేష్, కార్యవర్గ సభ్యులు డా. సి.స్వరాజ్యలక్ష్మి, వివి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ప్రైమరీ స్కూలుకు ఆర్‌వో వాటర్ ప్యూరిఫైయర్ వితరణ

నాగలాపురం, జనవరి 27 ప్రభాతవార్త: నాగలాపురం మండల పరిధిలోని చిన్నపట్టు గ్రామంలోని ప్రభుత్వ మోడల్ ప్రైమరీ పాఠశాలకు చెన్నైకి చెందిన దాత ఆర్‌వో వాటర్ ప్యూరిఫైయర్‌ను మంగళవారం వితరణగా అందించారు. ప్రతి ఏటా తమిళనాడుడు రాష్ట్రం చెన్నై నుంచి తిరుమల తిరుపతి పాదయాత్రగా వెళ్లే తిరుమల తిరుపతి పాదయాత్ర బృందం వారు విద్యార్థులకు పరిశుద్ధమైన తాగునీటి వసతిని కల్పించే దిశగా ఈ ఆర్‌వో ప్లాంటెని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్, మోహన్‌రూప, గ్రామ పెద్దలు సుధాకర్, వెంకటేశ్వరులు, విద్యా కమిటీ చైర్‌పర్సన్ జయప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు అందుకున్న ఏఎస్‌వో మల్లి

కేవీబీ పురం, జనవరి 27 ప్రభాతవార్త: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేవీబీ పురం మండలం ఏఎస్‌వో మల్లి విధుల్లో ఉత్తమ ప్రతిభను చూపినందుకు ఆమె మండల ప్రజలకు చేసిన సేవలను గుర్తించి ఉత్తమ అధికారిణిగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరులు, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ అధికారులు, కేవీబీ పురం మండల నాయకులు, ఆమె అభినందించారు.

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ బాగుంది - హెచ్ఎంకు ప్రశంసలు

కేవీబీ పురం, జనవరి 27 ప్రభాతవార్త: ప్రధానోపాధ్యాయుడి స్థానంలో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచడం, వారి విద్యా నైతికపై విరామం లేని సేవలను అందించడం బాగుందని కేవీబీ పురం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సురేష్‌పై సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు పాఠశాలకు విచ్చేసిన ఎమ్మెల్యే విద్యార్థులతో మాట్లాడారు. వారి విద్యా పటిష్టతపై ఆరా తీశారు. పాఠశాలలో చదువుతున్న అన్ని తరగతుల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు సురేష్, ఇంగ్లీష్ రైటింగ్ పై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న విషయాన్ని తెలుసుకుని కొందరు విద్యార్థుల చేతిరాతను పరిశీలించారు. ఇంగ్లీష్‌రాతపై విద్యార్థులు పట్టు సాధించడాన్ని గుర్తించి ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులఅభివృద్ధికితనవంతుసాయం అందించేందుకు సంసిద్ధంగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

పుత్తూరులో వీధి విక్రయదారుల నుంచి అక్రమ గేట్ వసూళ్లు నిలిపి వేయాలి

***పుత్తూ

12న మున్సిపల్ కార్మికుల సమ్మె

వెంకటగిరి, జనవరి 27 ప్రభాతవార్త: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు వెంకటగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ సాంబశివయ్యకి డిమాండ్స్‌తో కూడిన సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక సంస్కరణల పేరుతో తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, అన్నారు. వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న జరగనున్న దేశవ్యాపిత సమ్మెలో మున్సిపల్ కార్మికులు సంపూర్ణంగా పాల్గొంటారని అన్నారు. గత 17 రోజుల సమ్మెకు సంబంధించిన ఒప్పందాలపై జీఓలు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు, సుబ్బయ్య, ప్రసాద్, పెంచలయ్య, పోలయ్య, రమణయ్య, శ్రీను, శుభరత్నమ్మ కార్మికులు పాల్గొన్నారు

మున్సిపల్ ఆస్తుల పరిరక్షణకు రాజీ లేదు: కమిషనర్

శ్రీకాళహస్తి,జనవరి 27 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో ఆస్తుల పరిరక్షణకు రాజీ లేదని మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ మంగళవారం స్పష్టం చేసారు. హరహర బావి వద్ద ఓ వ్యక్తి ఆక్రమించుకొని పక్కా భవనాలు నిర్మించుకున్నారు. అయితే ఈ వివాదం కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన ప్రారంభం నుంచి ఆక్రమ ఆక్రమణకు సంబంధించి మున్సిపాలిటి నోటీసులు ఇవ్వటం ఆక్రమణ దారుడు కోర్టుకు వెళ్ళటం జరుగుతుంది. ఈనేపథ్యంలో మంగళవారం పార్టీ కార్యాలయం, మున్సిపల్ మంచినీటి సరఫరా ట్యాంక్ కింద వైకాపా హయాంలో అమాన్ అనే యువకుడు భవనం నిర్మించారు. పార్టీ కార్యాలయం పక్కనే ఉన్న స్థలం తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి సంబంధించినదిగా ఆక్రమణ జరిగే సమయంలోనే అడ్డగించారు. 2024లో మున్సిపాలిటి నోటీసు ఇవ్వగా ఆక్రమణదారుడు కోర్టును ఆశ్రయించినట్లు కమిషనర్ భవాని ప్రసాద్ వివరించారు. కోర్టు పరిశీలించిన తరువాత ఆక్రమణ దారుని వద్ద ఉన్న రికార్డులను మున్సిపాలిటికి సమర్పించాలని ఆదేశించినట్లు వివరించారు. కానీ 4 నెలల క్రితం మళ్ళీ నోటీసు ఇవ్వగా ఆక్రమణదారుడు మళ్ళి కోర్టును ఆశ్రయించాడు. 2 వారాల క్రితం నోటీసులు ఇవ్వగా ఆరు వారాలు సమయం ఇస్తూ రికార్డులు మున్సిపాలిటికి సమర్పించాలని దానిని ఆధారంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించిందన్నారు. తాము ఎన్నో సార్లు హెచ్చరిస్తున్నా ఆక్రమణదారుడు అమాన్ స్పందించటం లేదని మంగళవారం కుటుంబసభ్యులతో ఇంటిలో చేరి తలుపులు వేసుకొని బయటకు రాకుండా తమ విధులకు ఆటంకం కల్గిస్తున్నట్లు వివరించారు. అక్రమణదారుడు అమాన్‌ను ఆక్రమణ దారునికి రాజీవ్‌నగర్‌లో 2సెంట్లు భూమి ఇస్తామనిలేదా టిడ్కో ఇళ్ళలో ఓ ఇల్లు కేటాయిస్తామని చెబుతున్నా, వారు ఇంటి నుంచి బయటకు రావటం లేదని కమిషనర్ భవాని ప్రసాద్ వివరించారు.

నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

కుప్పం జనవరి 27 ప్రభాతవార్త: మండలంలోని గోనుగూరు పంచాయతీలో వెలసిన శ్రీ శివగిరి సుబ్రహ్మణ్య స్వామి ఆలయంకు వెళ్లే దారిలో నూతనంగా సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి మంగళవారం ప్రభుత్వ విప్, కడాపిఎ సి చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పికెఎం ఉడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్.సురేష్ బాబు, మండల టిడిపి అధ్యక్షుడు రాజగోపాల్, క్లస్టర్ ఇంచార్జ్ శ్రీనివాసులు, నడిమూరు సర్పంచ్ సంతోష్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

జగన్‌ను కలసిన బియ్యపు మధు

శ్రీకాళహస్తి,జనవరి 27 ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి,వైకాపా పార్టీ నాయకుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డిని మంగళవారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి కలసినారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన దిశ దెశ నిర్దేశం చేసినట్లు వివరించారు. జగన్ సూచనలు చేస్తూ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు, వైకాపా కార్యకర్తల పట్ల వ్యవహరిస్తున్న కక్ష సాధింపులకు సంబంధించి స్పందించాలని కార్యకర్తలకు అండగా ఉండాలని వారి చిన్న బాధను కూడా తమ సొంత బాధగా భావించి స్పందించాలని అధికారుల ఏకపక్ష నిర్ణయాలపై నిలదీయాలన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సాగుతున్న వైకాపా కార్యకర్తలపై కక్షసాధింపులకు సంబంధించి జగన్మోహన్‌రెడ్డికి వివరించినట్లు సమాచారం.

ఓటర్ల దినోత్సవం అవార్డుతో జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్‌ని సన్మానించిన జిల్లా జాయింట్ ఆర్.గోవిందరావు డిఆర్ఓ నరసింహులు.

తిరుపతి కలెక్టరేట్,ప్రభాతవార్త

29న తెలుగుగంగ నీటి సరఫరాలో అంతరాయం

తిరుపతి,జనవరి 27ప్రభాతవార్త: తిరుపతి నగరానికి నీటి సరఫరాచేసే తెలుగు గంగ హెడ్ వాటర్ వర్క్స్ నిర్వహణ కారణంగా ఈనెల 29వతేదీ గురువారం నగరంలో తెలుగుగంగ నీటి సరఫరా లో అంతరాయం ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తెలిపారు. మంగళం ఫిల్టర్ హౌస్ లీలా మహల్ పంపింగ్ స్టేషన్ వరకు ఉన్న 800 యమ్. యమ్. డయా గ్రావిటి పైప్ లైన్ సి. పి. ఆర్ అపార్ట్మెంట్ వద్ద లీకేజీ అయ్యి త్రాగునీరు వృధా అవుతున్నది. ఈ పైప్ లైన్ మార్చడం, మరమ్మతులు చేపట్టనున్నందున ఈ నెల 29 వ తేదీ గురువారం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుంది. కావున ప్రజలు సహకరించాలని కమిషనర్ మౌర్య తెలిపారు.

ఏప్రిల్ 23 వరకు ఎల్.ఆర్.ఎస్ గడువు పొడిగింపు

తిరుపతి,జనవరి 27ప్రభాతవార్త: తిరుపతి నగరపాలకసంస్థ పరిధిలో అనధికారిక లే ఔట్ల క్రమబద్ధీకరణకు (ఎల్.ఆర్.ఎస్) దరఖాస్తు దాఖలు గడువు ఏప్రిల్ 23 వరకు పొడిగించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న అనధికారిక లేఔట్ల లోని ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ఏప్రిల్ 23 వరకు మూడు నెలల పాటు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మూడు నెలల అనంతరం అనధికారిక లేఔట్లలో ఉన్న ప్లాట్ల లో భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబోమని కమిషనర్ మౌర్య స్పష్టం చేశారు.

రామ్మోహన్‌కు డాక్టరేట్ ప్రదానం

యూనివర్సిటీ(తిరుపతి),జనవరి 27ప్రభాతవార్త: వయోజన విద్యవిభాగంలో పరిశోధనకు కామిని రామ్మోహన్‌కు ఎస్వీయూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఎస్వీయూ ఆర్ట్సుకళాశాల అడల్ట్‌కంటి న్యూయింగ్ ఎడ్యుకేషన్ ఆచార్య ఆర్‌బి సత్యవతి పర్యవేక్షణలో రామమోహన్ "ఎస్టడీ ఆన్ ఫార్మర్స్ సూసైడ్స్ ఇన్‌రాయలసీమ రీజియన్"అంశంపై పరిశోదన వ్యాసం సమర్పించారు. ఈ మేరకు అతనికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ రాజమాణిక్యం తెలిపారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

యూనివర్సిటీ (తిరుపతి), జనవరి 27ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా నిర్వహించబడుతున్న వినియోగదారుల అవగాహన భారత్ యాత్రలో భాగంగా, వినియోగదారుల హక్కులు, బాధ్యతలు రక్షణ వ్యవస్థలపై అవగాహన కల్పించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో వినియోగదారుల అవగాహన కార్యక్రమం విజయవంతంగా మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా బీటెక్ విద్యార్థులకు సమాజానికి వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. అవగాహనతో కొనుగోలు విధానాలు, డిజిటల్ వినియోగదారుల భద్రత, అలాగే ఫిర్యాదు పరిష్కార విధానాలపై అవగాహన కల్పించడం. కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఆచార్య ఐ.వి. లలిత కుమారి నిర్వహించారు. యూనిట్ ఇన్‌ఛార్జి డాక్టర్ వి. జ్యోత్స్న, ఎం. పల్లవి,ఆర్. దివ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

సూళ్ళూరుపేట డివిజన్

హెచ్ఎం చలం బాబుకు ఘన సన్మానం

నాయుడుపేట, జనవరి 27 ప్రభాతవార్త: మండల పరిధిలోని కాపులూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న చంద్రగిరి చలం బాబును మంగళవారం పాఠశాల వద్ద సహ ఉపాధ్యాయులతో సర్పంచ్ సంగీతం సుబ్రమణ్యం, గ్రామ టిడిపి నాయకులు కాపులూరు చక్రపాణిలు ఘనంగా సన్మానించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా చలం బాబుకు ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా ఆర్డీవో కిరణ్మయి ప్రశంసాపత్రాన్ని అందజేసిన సందర్భంగా పాఠశాల వద్ద చలం బాబుకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటి రమేష్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని విమర్శించే అర్హత... కౌన్సిలర్లకు లేదు!

వెంకటగిరి, జనవరి 27 ప్రభాతవార్త: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను విమర్శించే అర్హత కౌన్సిలర్లకు లేదని తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు రామకృష్ణ, చంగారావు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. రిపబ్లిక్ డే వేడుకలు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైసిపి కౌన్సిలర్లను సభ వేదికపై పిలవకుండా ఎమ్మెల్యే అవమానపరచాలని వారు చేసిన విమర్శలు అర్థరహితమన్నారు. సమావేశం ప్రారంభం కాకముందే కౌన్సిలర్లు వెళ్లిపోయారని తెలిపారు. ఎమ్మెల్యే రామకృష్ణ అందర్నీ గౌరవిస్తారని చెప్పారు. పట్టణంలో కైవల్యా నది పక్కన ఉన్న స్థలాన్ని ఉన్న స్థలాన్ని కొందరు ఆక్రమిస్తున్నారని కౌన్సిలర్లు ఆరోపణ చేశారని ఎమ్మెల్యే దృష్టికి వస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఎవరు ఆక్రమించిన ఎమ్మెల్యే సహించడని తెలిపారు. కౌన్సిలర్ నారి శేఖర్, నరసింహులు, నిడిగంట రవి, రాధమ్మలు పాల్గొన్నారు.

గురుకులాలలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోండి

నాయుడుపేట, జనవరి 27 ప్రభాతవార్త: ఈ సంవత్సరంలో 2025 2026 గాను గురుకులాలలో ప్రవేశాలకు దరఖాస్తులుకు ఆహ్వానం పలికారు. నాయుడుపేటలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల పూదురు ప్రిన్సిపాల్ రూత్ రమోలా మాట్లాడుతూ విద్యార్థి, విద్యార్థినులకు గురుకుల పాఠశాలలో ప్రస్తుతం జనవరి 20వ తేదీ నుండి ఫిబ్రవరి 19వ తేదీ వరకు ఐదవ తరగతి నుండి జూనియర్ ఇంటర్ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించబడతాయని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. అన్ని రకాల వసతులు కలిగి గురుకుల పాఠశాలలలో ఉంటాయని ఆ పాఠశాల ప్రిన్సిపల్ రూత్ రమోలా అన్నారు.

నేత్రదాన శిబిరం విజయవంతంపై హర్షం

పెళ్లకూరు, జనవరి 27 ప్రభాతవార్త: చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో మంగళవారం నాడు తిరుపతి జిల్లా శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం కావడంతో ట్రస్టు నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ శిబిరానికి సుమారు 200 మంది కంటి వ్యాధితో బాధపడుతున్న రోగులు హాజరుకాగా వారిలో 20 మంది కంటిలో శుక్ల శాస్త్ర చికిత్స కోసం వచ్చిన వారు ఉన్నారు. కంటి పరీక్షలు కోసం వచ్చిన వారికి కంటి అద్దములు మందులు అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని ట్రస్ట్ సీఈఓ సీతారామ నాయుడు తెలిపారు.

యువగళం పాదయాత్ర మహా ప్రభంజనం

పెళ్లకూరు, జనవరి 27 ప్రభాతవార్త: మంగళవారం నాడు యువగళం పాదయాత్ర నేటితో మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తేదేపా మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య అన్నారు. యువగళం పాదయాత్ర కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎంతో దోహదపడిందన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో నాయకులు కార్యకర్తలు స్వీట్లు పంచుకుని యువగళం పాదయాత్ర నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి : ఎమ్మెల్యే

బాలాయపల్లి, జనవరి 27 ప్రభాతవార్త: సీఎం సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆస్పత్రులలో చికిత్స పొంది నగదు ఖర్చుపెట్టిన వారికి సీఎం సహాయనిది పథకం కింద వచ్చిన నగదు చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేదల వైద్యానికి ఎంతగానో ఉపయోగపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షులు మస్తాన్ నాయుడు, సొసైటీ అధ్యక్షులు ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన డిప్యూటీ ఎంపీడీవో

వాకాడు, జనవరి 27 ప్రభాతవార్త: మండలం కొండాపురం గ్రామంలోని మంగళవారం డిప్యూటీ ఎంపీడీవో ప్రతిభ రాణి తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. పనిచేస్తున్న సిబ్బంది పనితీరును పరిశీలించారు, ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందు బాటులో వుండెలా చూడాలని సూచించారు, అత్యవసరమైన సమయంలో తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట మండల సర్వేయర్ గోపిరెడ్డి, సచివాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.

చింతచెట్టు నుంచి పాలు

పుంగనూరు రూరల్, జనవరి 27 ప్రభాతవార్త: పట్టణంలోని ప్రభుత్వ శుభారాం డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఉదయం ఓ చింత చెట్టు నుంచి పాలు వంటి ద్రవం వెలువడటం స్థానికులలో ఆసక్తిగా మారింది. ఈ విషయాన్ని గమనించిన విద్యార్థులు, సిబ్బంది వెంటనే ఇతరులకు తెలియజేయడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడికి చేరుకున్నారు. చెట్టు నుంచి పాలు వస్తున్నాయంటూ ప్రచారం జరగడంతో ప్రజలు క్యూ కట్టి వీక్షించారు. ఇది వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానంలో పేర్కొన్న సంఘటనలలో ఒకటిగా కొందరు భావించారు. ఇది దైవ సంకేతంగా భావించి పలువురు పూజలు నిర్వహించారు.

గుడిమల్లంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో... శాఖలు సమన్వయంతో పని చేయాలి

ఏర్పేడు,జనవరి 27 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని చారిత్రక శివాలయంలో చాలా కాలం తరువాత శివరాత్రి ఉత్సవాలను బ్రహ్మోత్సవాలుగా నిర్వహించుటకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సూచనల మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మెన్ బత్తల గిరిబాబునాయుడు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆలయ ఆవరణలో 'శివరాత్రి సమీక్షా సమావేశం'ను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి హాజరై పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా చైర్మెన్ గిరిబాబునాయుడు మాట్లాడుతూ ఇప్పటి వరకు చేపట్టిన ఏర్పాట్లును సమావేశం దృష్టికి తెచ్చారు. మొదటి సారి భారీ ఎత్తున నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో మహాశివరాత్రి పర్వదినాన వచ్చే భక్తులకు ఎలాంటి అవరోధం లేకుండా సుదర్శనం సత్వర దర్శనం కోసం క్యూలైన్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆలయ ఇఓ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అనందవల్ల సమేత పరశురామేశ్వరుని సుదర్శనంకు కల్పించుటకు ఏర్పాట్లు చేసిన క్యూలైన్ల నమూనాలను వివరించారు. అంతేకాక వచ్చిన భక్తులకు సకల సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా భాను ప్రకాష్ రెడ్డి ఒక్కొక్క అంశానికి సంబంధించి వేర్వేరుగా సుధీర్ఘంగా చర్చించారు. పటిష్టమైన క్యూలైన్లతో పాటు వివిపిలకు టైం శ్లాట్ అమలు చేయాలని సమావేశం నిర్ణయించింది. వృద్ధులు వికలాంగులకు, చంటిబిడ్డల తల్లులకు వివిపి క్యూలైన్లలో అనుమతిస్తామని తెలిపారు. టైం శ్లాట్ సందర్భంగానే వివిపిలకు అనుమతిస్తామని ముందుగా వచ్చిన నిరీక్షించాల్సిందే అని సమావేశం నిర్ణయించింది. పోలీసు బందోబస్తుకు సంబంధించి సిఐ జయచంద్ర, శ్రీకాంత్‌రెడ్డిలు వివరించారు. ఈ సందర్భంగా చైర్మెన్ బత్తలగిరిబాబునాయుడు మాట్లాడుతూ పార్కింగ్‌కు పది ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు చూపారు.

రూ.12లక్షల బడ్జెట్‌తో...

ఈ ఏడాది మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను రూ.12లక్షల బడ్జెట్‌తో నిర్వహించుటకు అనుమతివచ్చిందని ఇఓ రామచంద్రారెడ్డి వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పుష్పాలంకారం, విద్యుత్ దీపాలంకరణలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. దాతల సహాయంతో వాహన సేవలు నిర్వహించుటకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఉభయదారులకు ప్రత్యేక గుర్తింపు దర్శన అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. మహాశివరాత్రి పర్వదినాన 11.50 గంటలకు మహానైవేద్యంను 20 నిముషాలు బ్రేక్ ఉంటుందన్నారు. సమీక్షా సమావేశంలో చైర్మెన్ బత్తల గిరిబాబునాయుడు, ఇఓ రామచంద్రారెడ్డి, ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి సిఐ జయచంద్ర, శ్రీకాంత్‌రెడ్డి, తహశీల్దార్ భార్గవి, ఎంపిడిఓ సౌభాగ్యం, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గణనాధుని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

కాణిపాకం, జనవరి 27 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని పలువురు ప్రముఖులు మంగళవారం కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఈమేరకు శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, తిరుపతి బర్డ్స్ డైరక్టర్ డాక్టర్ జగదీష్, సెంట్రల్ ఇన్‌కంటాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఛైర్మన్ సివి.బందర్‌లు వేర్వేరుగా కుటుంబసభ్యులతో కలసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ మణి నాయుడు, ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓలు రవీంద్రబాబు, ప్రోటోకాల్ ఏఈఓ ధనపాల్, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్‌లు బాలాజినాయుడు, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి : విజయ్‌బాబు

పుత్తూరు, జనవరి 27 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గంలోని రైల్వే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు మంగళవారం చెన్నైలో డిఆర్ఎం శైలేంద్ర సింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ద్రౌపదీ దేవి గుడి వద్ద గేట్ పుత్తూరు నుంచి ప్రజలు పట్టణంలోకి రాకపోకలు సాగించేందుకు పట్టాలు దాటుతూ తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో అండర్ బ్రిడ్జి నిర్మిస్తే సమస్య తీరుతుందని వివరించారు. ఎల్‌సి నెంబరు 51, 65 రైల్వే గేట్ల వద్ద ఓవర్ బ్రిడ్జిలు, 52వ నెంబరు ఎల్‌సి గేట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. తిరుత్తణి నుంచి రేణిగుంట వరకూ యూనిట్ ట్రైన్లను పొడిగించాలని కోరారు. పుత్తూరు రైల్వే స్టేషన్‌లో మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం వల్ల మహిళలు, సీనియర్ సిటిజన్లు ఇబ్బంది పడుతున్నారని అందువల్ల వెంటనే మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. దీనికి సమాధానంగా డిఆర్ఎం మాట్లాడుతూ ద్రౌపది గుడి వద్ద 2.5 మీటర్ల అండర్ బ్రిడ్జి నిర్మిస్తామని చెప్పారని, ఒక వారం లోపు మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారని విజయ్‌బాబు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రవినాయుడు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో దొంగలు పడ్డారు

- లాప్‌టాప్, ప్రింటర్లను ఎత్తుకెళ్ళిన దొంగలు

గుడిపాల, జనవరి 27 ప్రభాతవార్త: మండల పరిధిలోని పేయనపల్లి గ్రామ సచివాలయంలో దొంగలుపడ్డారు. గ్రామ సచివాలంలో ప్రజా సమస్యల పరిష్కరించడానికి వున్న ఒక లాప్‌టాప్, మూడు ప్రింటర్లను దొంగలు దోచుకెళ్ళారు. వివరాలిలా వున్నాయి. సోమవారం గణతంత్ర దినోత్సవం కావడంతో మధ్యాహ్నానికి కార్యక్రమాలు ముగించుకుని సచివాలయ సిబ్బంది సచివాలయంకు తాళాలు వేసి వెళ్ళారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి సచివాలయం తాళాలను పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు సచివాలయంలో విలువైన వస్తువులను ఎత్తుకెళ్ళారు. ముఖ్యంగా ఒక లాప్‌టాప్‌తో పాటు మూడు ప్రింటర్లు దొంగతనంకు గురైనట్లు సచివాలయ సిబ్బంది గుర్తించారు. మంగళవారం ఉదయం విధులు నిర్వర్తించడానికి వచ్చిన సచివాలయ సిబ్బందికి తాళం పగులగొట్టి వుండటంతో లోపలికి వెళ్ళి చూశారు. అప్పటికే దొంగలు సచివాలంలోని వస్తువులను దొంగలించుకొని వెళ్ళడంతో ఈ విషయంను సచివాలయ సిబ్బంది ఎంపిడిఓకు సమాచారం అందించారు. ఎంపిడిఓ సూచనల మేరకు సచివాలయ సిబ్బంది గుడిపాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ రామ్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డయాబెటిక్ ఫుట్ క్లినిక్ సేవలు ప్రారంభం

తిరుపతి హెల్త్, జనవరి 27 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఎండో క్రైల్నజీ, జనరల్ సర్జరీ, సిటి సర్జరీ విభాగల ఆధ్వర్యంలో డయాబెటిక్ ఫుట్ క్లినిక్ సేవలు శ్రీ పద్మావతి హాస్పిటల్ నందు మంగళవారం ప్రారంభించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేసారు. ఈ కార్యక్రమాన్ని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్, ఎండో క్రైల్నజీ విభాగాధిపతి డా. అలోక్ సచన్, జనరల్ సర్జరీ విభాగాధిపతి డా. ముత్తేశ్వరయ్య, యస్‌పియంసి డబ్ల్యూ ప్రిన్సిపాల్ డా. ఉషా కళావత్, ఆర్‌యంఓ డా. కోటిరెడ్డిలు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్ మాట్లాడుతూ క్లినిక్ ఉద్దేశ్యం డయాబెటిక్ ఫుట్ సమస్యలతో బాధపడుతున్న రోగులకు సమగ్ర, బహుశాఖల ఆధారిత చికిత్స అందించడం ద్వారా త్వరిత గుర్తింపు, సమయోచిత జోక్యం సమన్వయ నిర్వహణ చేయడం అని తెలియజేసారు. డాక్టర్ హరిప్రసాద్ ప్రొఫెసర్, జనరల్ సర్జరీ, పొడియాట్రిక్, డయబేటిక్ ఫుట్ క్లినిక్ అధ్యక్షులుగా నియమితులు అయ్యారని, అలాగే పొడియట్రిక్, డయబేటిక్ ఫుట్ సమస్యలపై ప్రత్యేక శిక్షణ పొందారని తెలి